శ్రీ రామభద్ర శతకము

రచయిత: కీ.శే. శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు గారు

(జీవన కాలము: 1902 - 1983)

ॐ

శ్రీ రామభద్ర శతకము



రచయిత: కీ.శే. శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు గారు

(జీవన కాలము: 1902 - 1983)

శ్రీ రామభద్ర శతకము

రచయిత: కీ.శే. శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు గారు
(జీవన కాలము: 1902 - 1983)

SHRI RAMABHADRA SHATAKAMU (Free E-Book)

Author: Late Shri Chiruvolu Durga Prasada Rao

First Edition: March 1982

Second Edition: 06 – 10 – 2025

Contact details of Publisher (ప్రకాశకుడు):

M. V. S. Ranganadham
H. No. 5-12-78/46,
Laxmipuri Colony Phase – 2,
Sainikpuri, Hyderabad – 500 094.
Telangana State.
Mob: +91 9818878155
E-Mail: mvsranganadham@hotmail.com

ముందు మాట

ఇది శ్రీ రామభద్ర శతకము రెండవ ముద్రణ. రచయిత మా గురువు గారు, మాతామహులైన, కీ.శే. శ్రీ చిరువోలు దుర్గా ప్రసాద రావు (సన్యసించిన తరువాత పేరు శ్రీ రామానంద జ్యోతి) గారు. శతకం తొలి ముద్రణ 1982లో మా మేనమామగారైన శ్రీ చిరువోలు విజయ నరసింహారావు గారు ఉద్యోగరీత్యా రాజమహేంద్రవరంలో ఉన్న కాలంలో వారు వేయించారు. వారికి ఆ రోజుల్లో తీరుబడి లేకపోవడం వల్ల, శతకం తొలి ముద్రణలో కొన్ని ముద్రారాక్షసాలు (అచ్చుతప్పులు), వేరే దోషాలు దొర్లినాయి. అవన్నీ వీలయినంతవరకు పరిష్కరించి, ఈ రెండవ ముద్రణని ఉచిత ఎలక్ట్రానిక్ పుస్తకముగా (Free E-Book) ప్రకటించాలని నిర్ణయించాము. ఈ ప్రయత్నంలో, శ్రీ చిరువోలు విజయ నరసింహారావు గారు, 86 ఏళ్ళ వయస్సులో తన ఆరోగ్యం సహరించక పోయినా కూడా, ఓపిక చేసుకొని కేవలం మా గురువుగారి మీది గౌరవంతో ప్రథమ ముద్రణలో దొర్లిన దోషాలను పరిష్కరించడమే కాకుండా, ఈ శతకంతో పాటు ప్రచురించడానికి "కవి సన్నుతి" వ్రాసి పంపారు. వారికి ధన్యవాదములు. ఆ "కవి సన్నుతి"లో, వారు శతక రచయిత గురించి, శతకములో ఉన్న కవితా వైశిష్ట్యము గురించి వివరించి యున్నారు. వారు చెప్పిన విషయాలతో పూర్తిగా ఏకీభవిస్తూ, నేను నాకు తోచిన రెండు మూడు విషయాలు జోడించఁ దలుచుకున్నాను.

రచయిత విశ్వవీక్షణా సామర్థ్యము కలిగిన చిరువోలు గ్రామ నివాసి. ఆ ఊరిలో ఒక బడి, ఒక గుడి (రామాలయం) కట్టించిన సంఘసేవకుడు. అన్నిటికీ మించి అచంచల రామభక్తుడు. చిరువోలులో తాను కట్టించిన రామాలయం లోని శ్రీరాముని కీర్తిస్తూ శతకం వ్రాయడానికి ఆయన ఎన్నుకున్న సార్థకమైన మకుటము "చిరువోలు పురీశుడ రామభద్రుడా!". ఛందశ్శాస్త్రము

ప్రకారం, ఈ మకుటంతో ఉత్పలమాల, చంపకమాల పద్యాలు వ్రాయడానికి మాత్రమే కుదురుతుంది. "కవి సన్నుతి"లో చెప్పబడినట్లుగా మా గురువు గారు సంస్కృత, తెలుగు, అన్య భాషా పదాలతో కవిత్వం చెప్పారు. ఎక్కువగా దీర్ఘసంస్కృతసమాస భూయిష్ఠంగా గంగా ప్రవాహంలా సాగే వారి కవిత్వానికి మత్తేభ శార్దూలాలు సరిపడే ఛందస్సు. ఉత్పలమాలలు, చంపకమాలలు వ్రాయవలసి రావడం ఒక రకంగా ఆయన మకుటం ఎన్నిక ద్వారా తనకు తానే వేసుకున్న సంకెళ్ళు (self-imposed fetters). ఎందుకంటే, ఆ రెండు ఛందస్సులలో ఏ పాదంలోనూ వరుసగా రెండు గురువులు రావు. ఇక, వరుసగా మూడు గురువులు గానీ అంతకన్నా ఎక్కువ గానీ రావడం మాట తలవడమే అనవసరం. దీర్ఘసంస్కృత సమాసాలు ప్రయోగించడానికి ఇది పెద్ద ప్రతిబంధకం. ఈ పరిమితి ఉన్నా కూడా, రచయిత వీలయినప్పుడల్లా సంస్కృత సమాసాలు గుప్పించారు, ఈ శతకంలో.

ఇక, మకుటం ఎన్నికలోనే రెండవ పరిమితి ఉంది. 20-21 అక్షరాల పద్యపాదంలో మకుటమే 13 అక్షరాలు ఉంది. అందుచేత, శతకంలోని ప్రతి పద్యము ఒక సమస్యాపూరణం లాంటిది. లయ బద్ధంగా ఆశుకవిత్వం చెప్పే అలవాటు ఉన్న మా గురువుగారి లాంటి కవులకు, యతి ప్రాస చూసుకుంటూ ఉత్పలమాల ఆఖరి పాదంలో "నానన నాననాన" అనుకొని తరువాత మకుటం అనుకోవడం, లేదా చంపకమాల ఆఖరి పాదంలో "నననన నాననాన" అనుకొని తరువాత మకుటం అనుకోవడం, కొంచెం ఇబ్బందితో కూడుకున్న విషయం. అయినా కూడా, చాలా వరకు పద్యాల నడకలో అవరోధాలు వచ్చినట్లు కనపడకుండా రచయిత కవిత్వం చెప్పారు.

ఉత్పలమాలకి చంపకమాలకి ఉన్న తేడా చాలా చిన్నదే. ఉత్పలమాల వృత్త పద్యంలో ప్రతిపాదంలో 20 అక్షరాలు, "భరనభభరవ" అన్న గణాలు ఉంటాయని, గురువుగా ఉన్న మొదటి అక్షరాన్ని రెండు లఘువులుగా చేసి ఆ రెండవ లఘువును ప్రాసాక్షరంగా చేస్తే ప్రతిపాదంలో 21 అక్షరాలతో "నజభజజజర" అన్న గణాలతో చంపకమాల వృత్తం అవుతుందని చిన్నప్పుడు ఛందస్సు బోధించిన మా గురువు గారే చెప్పారు. "మాల" అన్నా "మాలిక" అన్నా పూదండ అని అర్థం. సంగీతంలో, చరణం చరణానికి రాగం మారుతూ ఉంటే అటువంటి గేయాన్ని / కీర్తనని రాగమాలిక అంటారు. కానీ, పద్యకవిత్వంలో, ఒకే ఛందస్సు, ఒకే ప్రాస ఉండి, పద్యంలో

ఉండవలసిన 4 పాదాల కన్నా ఎక్కువ పాదాలు ఉంటే పంచపది, షట్పది, అష్టపది, ... మాలిక, అంటారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే, రచయిత ఈ 136 పద్యాల శతకం ఎక్కువగా మాలికలుగా కనబడేటట్లుగా వ్రాయడం. భక్త్యావేశం ఉన్న పాఠకులు చదువుకోవడానికీ పాడుకోవడానికీ, ఈ మాలికలు దండకాల లాగా చాలా అనువుగా ఉంటాయి. ఒకే ఛందస్సు, ఒకే ప్రాసతో ఒకటి కన్నా ఎక్కువ పద్యాలు ఉండడాన్ని మాలిక అని అనుకున్నాం కదా. అలా, ఈ శతకంలో 23 మాలికలలో 119 పద్యాలు (87.5 %) ఉన్నాయి. ఉత్పలమాల ఛందస్సులో వ్రాయబడిన 75 పద్యాలలో 61 పద్యాలను (81 %) మాలికలుగా చూడవచ్చు. మిగిలిన చంపకమాల ఛందస్సులో వ్రాయబడిన 61 పద్యాలలో 58 పద్యాలను (95 %) మాలికలుగా చూడవచ్చు. కొంచెం చిన్న మాలికలను వదిలేస్తే, ఒకే ఛందస్సు ఒకే ప్రాస ఉన్న 4 లేక అంతకంటే ఎక్కువ పద్యాలు ఉన్న 14 మాలికల వివరాలు, వాటిల్లో ఉన్న 100 పద్యాల (73.5 %) క్రమ సంఖ్యలు క్రింది పట్టికలో ఇవ్వబడ్డాయి.

క్రమ సంఖ్య	ప్రాస	ఛందస్సు	పద్యాల క్రమ సంఖ్యలు	మొత్తం
1	న	చం	16, 18, 19, 20, 21, 30, 46, 47, 49, 50, 73, 74, 81, 82, 85, 98, 134	17
2	ర	చం	3, 4, 5, 6, 7, 40, 41, 80, 83, 91, 97, 127, 128,	13
3	ల	చం	33, 38, 39, 42, 44, 94, 107, 116, 117, 129	10
4	క	ఉ	1, 2, 9, 68, 69, 70, 71, 102, 115	9
5	మ్మ	ఉ	25, 27, 45, 63, 64, 65, 66, 67	8
6	క్క	ఉ	11, 93, 99, 105, 113, 131, 135	7
7	వ	ఉ	72, 75, 79, 114, 123, 124	6
8	డ	చం	58, 59, 60, 61, 62	5
9	భ	చం	8, 10, 35, 36, 89	5
10	ట్ట	ఉ	84, 100, 119, 120	4

11	ప	ఉ	103, 109, 112, 126	4
12	ప్ప	ఉ	23, 24, 28, 29	4
13	మ	ఉ	76, 77, 78, 133	4
14	వ	చం	32, 92, 110, 122	4
			మొత్తం	100

శతకాల్లో ప్రతి పద్యంలో ఆఖరి పదాలు మకుటం రూపంలో పునరావృతం అవ్వడం సర్వసాధారణమైన విషయమే. కానీ, కొన్ని పద్యాల ఎత్తుగడలు, అంటే మొదట్లో వచ్చే పదం లేక పదాలు ఒకటే అవ్వడం ఈ శతకంలోని విశేషం. ఉదాహరణకి "శరణము" అన్న ఎత్తుగడతో 3, 6, 7 క్రమ సంఖ్యలు గల పద్యాలు, "శరణు" అన్న ఎత్తుగడతో 4, 5 క్రమ సంఖ్యలు గల పద్యాలు, "నినుఁ గను" అన్న ఎత్తుగడతో 18, 20, 21, 74 క్రమ సంఖ్యలు గల పద్యాలు, "రమ్ము!" అన్న ఎత్తుగడతో 63, 64, 65, 66, 67 క్రమ సంఖ్యలు గల పద్యాలు ఉన్నాయి. ఇలా ఉండడం పద్యమాలికలను బాగా ఆస్వాదించడానికి అనువుగా ఉంటుందని నా అభిప్రాయం.

ఇక ఆఖరుగా, ప్రథమ ముద్రణలో దొర్లిన దోషాల గురించి పాఠకులకి వివరించాల్సిన విషయాలు ఒకటి రెండు ఉన్నాయి. కామేశ్వరీ శతకానికి వ్రాసిన "ముందుమాట"లో చెప్పినట్లుగా, ఈ శతకం ప్రథమ ముద్రణలో కూడా కొన్ని వ్యాకరణ దోషాలు, ఇతర దోషాలు అచ్చుతప్పుల వల్ల గాని మరే ఇతర కారణాల వల్ల గాని దొర్లినాయి. ఆ దోషాలు మా గురువుగారు పద్యాలు డిక్టేట్ (dictate) చేసినప్పుడు వ్రాసిన వాళ్ళు చేసిన తప్పులవచ్చు, లేదా ముద్రణకు ముందు చెయ్యాల్సిన ప్రూఫ్ రీడింగ్ (proof reading) సరిగ్గా జరిగి ఉండకపోవడం వల్ల కావచ్చు. అవి కాక, కొన్ని పద్యాలలోని మకుట పాదంలో ఉద్దేశపూర్వకంగానే యతిమైత్రీభంగం జరిగింది అని నా అభిప్రాయం. అదేమిటో, కొంచెం వివరంగా చూద్దాం.

ఇంతకు ముందే చెప్పిన విధంగా, వ్రాసినవి ఉత్పలమాలలు, చంపక మాలలు కాబట్టి, ప్రతిపద్యం ఆఖరి పాదంలో (మకుట పాదం) మొదటి అక్షరానికి మకుటంలోని "చిరువోలు" అన్న పదంలోని "వో" అన్న అక్షరానికి యతిమైత్రి ఉండేలా చూసుకోవాలి. "వో"తో యతిమైత్రి ఉండే అక్షరాలు -

వు, వూ, వొ, వో, పు, పూ, పొ, పో, ఫు, ఫూ, ఫొ, ఫో, బు, బూ, బొ, బో, భు, భూ, భొ, భో అన్న అక్షరాలు. "చిరువోలు" అన్నది ఊరు పేరు. అది ఒకటే పదం. అలా అనుకుంటే (అనుకోవడమేమిటి, అదే నిజం) పైన చెప్పిన అక్షరాలకి మాత్రమే యతిమైత్రి కుదురుతుంది.

అలా కాకుండా, "చిరువోలు" అన్న పదాన్ని మాట వరసకి రెండు పదాల సంధిగా అనుకుంటే, అంటే, చిరు + ఓలు అని అనుకుంటే, అప్పుడు వ్యాకరణ సూత్రాల ప్రకారం, ఉత్తర పదంలోని మొదటి అక్షరంతో, అంటే "ఓ"తో యతిమైత్రి చెయ్యాలి. "ఓ"తో యతిమైత్రి ఉన్న అక్షరాలు - ఉ, ఊ, ఒ, ఓ అన్నవి, ఇంకా, యడాగమ సంధి జరిగినప్పుడు వచ్చే - యు, యూ, యొ, యో అన్నవి మాత్రమే. అలా అయితే, వు, వూ, వొ, వో, పు, పూ, పొ, పో, ఫు, ఫూ, ఫొ, ఫో, బు, బూ, బొ, బో, భు, భూ, భొ, భో - అన్న అక్షరాలు యతిమైత్రికి పనికిరావు. రెండు పదాల సంధి చేసి ఈ అక్షరాల ధ్వని అవసరమయిన చోట వచ్చేటట్లు చేసినంత మాత్రాన యతిమైత్రి పొసగదు. ఈ శతకం ప్రథమ ముద్రణలో, చాలా చోట్ల "చిరువోలు" అన్నది ఒకే పదం అనుకుని చేసిన యతిమైత్రులు ఉన్నా, కొన్ని చోట్ల అలా జరగలేదు. అలా అని, రెండు పదాల సంధిగా అనుకున్నారని చెప్పలేము, ఎందుకంటే, రెండూ ఒకేసారి పొసగవు కాబట్టి. కొన్ని చోట్ల "చిరువోలు" అన్నది ఒకటే పదమని, కొన్ని చోట్ల అది రెండు పదాల సంధి అని అనుకుంటామంటే మామూలుగా అయితే నడవదు. మరి ఏమి జరిగి ఉండాలి?

ధ్వనియతి, ఏదో ఒక సారూప్యం ఉన్న యతి లాంటివి ఉంటాయని ఎప్పుడో విన్నాను. శ్రీశ్రీగారు, ఒక కంద పద్యం రెండవ పాదంలో "రగా దగదు కాని దాని ఠస్సాగొయ్యా!" అని వ్రాశారు. ఇక్కడ "ర" కు "ఠ"కు వేసిన యతికి ఆయన "కంటి కింపయిన యతి" అని పేరు పెట్టారు. అంటే, రెండక్షరాలకు పొట్టలో చుక్క మినహా తేడా ఏముందని, చూడడానికి ఒకేలా ఉన్నాయని. అట్లా చెయ్యడం, శ్రీశ్రీగారి స్థాయికి చెల్లుతుంది గానీ నా లాంటి వాళ్ళకి చెల్లదు. సరే, ఈ రూప సారూప్యం సంగతి అట్లా ఉంచితే, కవులకి కొన్ని ఇష్టాయిష్టాలు, అభిరుచులు (passions) ఉంటాయని విన్నాను. మా గురువు గారి విషయంలో అయితే చూశాను. ఆయన పద్యాలు డిక్టేషన్ (dictation) ఇచ్చేటప్పుడు, ఇక్కడ యతిభంగం అయిందని వ్రాసేవాడు చెబితే ఒక్కోసారి దాన్ని మార్చి చెప్పేవారు. ఒక్కోసారి, అదే బాగుంది, అలాగే ఉంచెయ్యి అని అనేవారు. పైగా, "నిరంకుశాః

కవయః" అని సమర్ధన (justification) చెప్పేవారు. ఇలాంటివి నా స్వానుభవంలో కూడా జరిగాయి. ఉదాహరణకి, "ఉమ్మలికము" అన్న పదం ఆయనకు ఇష్టమైతే, ఆ పదంలోని "ఉ" అన్న అక్షరానికి "వో" అన్న అక్షరానికి యతిమైత్రి చేసేస్తారు, కూడదని తెలిసి కూడా. ఈ శతకం ప్రథమ ముద్రణలో, ఇలాంటి యతిమైత్రి భంగాలకు కొన్ని ఉదాహరణలుగా క్రింది పదాలు, ఆ పదాల్లో "వో"కి యతి వేసిన అక్షరాలకు క్రింద గీత (underline) గీసి, ఇస్తున్నాను.

"నన్నురక, నందుభయులు, నేనొక్కడ, దీ వుల్లస మూని, మా కున్నె, కాయుని, పదం బున్నతి, నీ వొనర, యో దనుజాపహారి, యొప్పిద మెట్లు, ఒప్పిదమై, మా కుమ్మడి, నా కొదవునే, నా యుమ్మలికంబు, నీ యుప్పు, నీ వొప్పిన, మీ యున్నతి, ఆంజనేయుం గడు, ఉద్యుక్తుడ వౌచు, యురు కరుణాబ్ధి, నా కొనర, మాయును గద, నీ వొనరుప ఏని, కుందగా నొదవెను, బాగోగుల, నా యోగము, ఓ సురముఖ్య, మీ రుంచుడు, యే యొడుపున, యొడయడ, భూలోక, ఆలోకన, నొనరగ, యొనర, నోరూర, నన్నోముట, నీ వోముట, నొనర, యురు కరుణాబ్ధి, నొట్టు సుమీ, ఉభయము, నీ వోర్తువు, నా కొక్క, రేయులు, కోహో, యొరపున, మాయును, మీ యొక్క, మిమ్మోరిమితో, మన్మనోలోక, నన్నోపిక, నే నొంటిగ, గావగా నొక్క, మీ కొలది, యోచన, తా నోపును, కేలూది, యూరక, సుక్కున, యులుకుచు, మీరుట్టి పడంగ, దోవగ, నచ్యుత, వంచో, నే నురక, యురగ శయాన, కొమ్మోరిమి, నన్నొక్కని, యో మహనీయ, నీ యుక్కు"

పైన చెప్పిన యతిమైత్రి భంగాలు చూసిన తరువాత, మా గురువుగారికి ఉన్న అభిరుచుల గురించి తెలిసినా, ప్రథమ ముద్రణలో జరిగిన దోషాలను తెలిసిన తరువాత పట్టించుకోకుండా వదిలిపేయడానికి సాహిత్యపరంగా వారికి ఉన్న స్థాయి (stature) నాకు లేదు. అందుకే, సముచితంగా ఆ దోషాలని పరిష్కరించడం జరిగింది.

పాఠకులు రచయిత వ్యక్తిత్వము తెలుసుకోవడానికి, ఈ శతకంతో పాటు దోహద పడతాయని, శతకం తొలి ముద్రణలో ఉన్నటువంటి - (1) రచయిత వ్రాసిన పీఠిక, (2) 1975వ సంవత్సరంలో రచయిత నాటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవియైన కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ

గారికి వ్రాసిన లేఖ సారాంశము (ఈ లేఖ నేను నా స్వహస్తాలతో విశ్వనాథ వారికి విజయవాడలో వారి స్వగృహంలో అందించాను.), (3) రచయిత వ్రాసిన కొన్ని భజన కీర్తనలు, ఈ పుస్తకంలో మళ్ళీ ఇవ్వటం జరిగింది. చిరువోలు గ్రామంలోని రామాలయంలో మా గురువు గారూ మేమూ చేసే భజనలలో ఈ భజన కీర్తనలు కూడా పాడేవాళ్ళం.

రచయిత ఆరాధ్యదైవమైన శ్రీరామభద్రుడే కాదు, రచయిత కూడా చిరువోలు పురీశుడే. తన జీవిత కాలంలో ఆ ఊరిలో మకుటం లేని మహారాజుగా వెలిగిన ఈ శతక రచయితను, శతక మకుటానికి సారూప్యమైన మకుటంతో వ్రాసిన పద్యంలో కీర్తించాలని చిన్న ప్రయత్నం చేశాను. ఆ పద్యం క్రింద ఇచ్చాను. మీరు కూడా అస్వాదించండి.

ఉ ॥ శ్రీరఘురాము రమ్యగుణ శీలములన్ జనులందుఁ జెప్పుటన్,
సారపు ధర్మ సూత్రములు సంఘము నందున బోధఁ జేయుటన్,
యోరుపునన్ పొలంపనులు యొజ్జతనంబును నిర్వహించుటన్,
పూరముగా కవిత్వమును బోరనఁ జెప్ప, చికిత్సఁ జేయుటన్,
చేరి స్వతంత్ర సంగరము సీమకు దాస్యముఁ బాపు టందు, యా
చారముగా హతాశు కుపచర్యలలో పరమాత్మఁ జూచుటన్,
భూరి యశస్సు నీది, చిరువోలు పురీశ! ప్రసాద రాయడా!

సైనిక్ పురి, హైదరాబాదు, భవదీయుడు,
ది: 06 - 10 - 2025. మద్దాలి వేంకట సత్య రంగనాధం

శ్రీ రామభద్ర శతకము

విషయ సూచిక

***

క్రమ సంఖ్య	పుస్తకం లోని విషయము	పుటలు
1.	కవి సన్నుతి	11 నుండి 14 వరకు
2.	ప్రథమ ముద్రణలో రచయిత వ్రాసిన పీఠిక	15
3.	విశ్వనాథ సత్యనారాయణ గారికి వ్రాసిన లేఖ సారాంశము	16
4.	రచయిత వ్రాసిన కొన్ని భజన కీర్తనలు	17 నుండి 21 వరకు
5.	శ్రీ రామభద్ర శతకము	22 నుండి 49 వరకు

ఓం శ్రీసాయిరాం!

శ్రీ రామభద్ర శతక కవి సన్నుతి

***

శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు (శ్రీ రామానంద జ్యోతి) విరచిత భక్తి ప్రధాన శతకములు మూడు కలవు. వాటిలో ఈ శ్రీ రామభద్ర శతకము అనునది రెండవది. ప్రసాదరావు గారు నా తండ్రిగారు, సద్గురువు, మార్గదర్శకుడు, విశిష్ట విషయ బోధకుడు. నాకు భక్తి జ్ఞాన నైతిక సద్వర్తనముఁ గఱపిన మహితాత్ముడు. వారికి వినమ్ర పాదాభివందనముల నర్పించుచున్నాను. కాలక్రమమున నేను కూడా కవిత్వమును వ్రాయుట నభ్యసించి, దాదాపు సఫలీకృతుడ నైతిని.

ప్రసాదరావు గారికి ప్రాచీన కవు లన్నను, వారి కవిత్వ మన్నను గొప్ప అభిమానము ఉండేది. ఆధునిక కవిత్వమును, కొన్ని పరభాషా పదములను కూడా వారు గౌరవించేవారు. వారికి విద్యాబోధన మందే కాక హోమియోపతి వైద్యము నందును ప్రావీణ్యము ఉండేది. పల్లెవాసు లెందరికో వ్యాధి నివృత్తినిఁ (ఉచితముగా) గూర్చి మానవ సేవ సలిపిన మహనీయులు. వారి శతకముల సవరణలు గాని, తద్విమర్శ గాని నా బోంట్లు చేయఁ బూనుట కడు సాహసమే. వారు నన్ను క్షమించెదరు గాక.

సాధ్యమైనంతవరకు నా అవగాహన మేరకు శతకము నందలి కవితాప్రాభవము నుగ్గడించి పరిశీలించ ప్రయత్నించెదను. కోరి ప్రయత్నించి పద్య రచన చేయక, సహజముగా కలిగిన భావప్రభావమున వారాశువుగా చెప్పి వ్రాయించెడివారు. బహుగ్రంధ పఠనము చేత, బుద్ధిగ్రాహ్యత వలనను, ధారాళముగా పదప్రయోగములు చేయగలిగిరి. పలు విధముల జరిగిన దోషములే కాని, కవి గారిచే నివి సంభవించ లేదు.

రచయిత కవిత్వం గురించి కొన్ని పరిశీలనలు, వైశిష్ట్యములు:

1. ధార గంగాప్రవాహము వలె స్రవించి పారును.

2. అర్థము చక్కని అన్వయముతో గ్రహింప సాధ్యమగును.

3. పద ప్రయోగము చక్కని గమకములతో అంత్యప్రాసలతో నుండి పఠితల కానంద మందించును.

4. అచ్చముగా చక్కని తెలుగు పదములను వీరు ప్రయోగించిరి.

5. అనేక పద్యములలో సంస్కృత పదబంధ విన్యాసము ద్యోతకమగును. వీనుల కవి విందుఁ గూర్చును.

6. అచ్చటచ్చట నన్య భాషా పదముల నుపయోగించిరి. దానిచే ఆయా భాషల యందు వారికిఁ గల అభినివేశమును గ్రహించఁ గలము.

7. కొన్ని పద్యములు వ్రాసిన తీరు రామదాసు గారి దాశరథీ శతక పద్యములను, మరి కొన్ని పద్యముల లోని నిర్మాణ కౌశలము పోతన గారి భాగవత పద్యములను, తలపించును.

శరణాగతికి ఉదాహరణములు: 3 నుండి 8 వరకు క్రమసంఖ్యలుఁ గలిగిన పద్యములు

చక్కని పదబంధముల కుదాహరణములు: 6వ పద్యం లోని శర్వ సన్నుత, లసచ్చరణాంబుజయుగ్మ, 15వ పద్యం లోని ఉన్నతు డాద్యు డాఢ్యుడు గుణోత్తరు డార్త శరణ్యుడు, 36వ పద్యం లోని ఇభ వరదా, దయాశరధి, 41వ పద్యం లోని పునర్జనన ప్రాపిత గర్భ నివాస నారకంబు, 43వ పద్యం లోని శ్రమ మనుకోక రమ్ము, 63వ పద్యం లోని రమ్ము కటాక్షవీక్షణ, 64వ పద్యం లోని రమ్ము మహాత్మ, 65వ పద్యం లోని రమ్ము ప్రభాకరాన్వయ, 66వ పద్యం లోని రమ్ము సురేశు వైరి, 67వ పద్యం లోని రమ్ము కరీంద్రు నార్తి, 71వ పద్యం లోని శ్రీకరమై సమస్త శుభ, ప్రాకట ఘోరపాతక విపాటన పాటవము , 75వ పద్యం లోని శ్రీ రవివంశ వారినిధి శీత, 80వ పద్యం లోని మొర వినవేర రామ

ఉపమాలంకారము: 47వ పద్యం లోని మును పొక మాయలేడి

అచ్చ తెలుగు పదములు: 23వ పద్యము లోని కప్పుర మందు తావి, 24వ పద్యము లోని కొప్పుకు పూలు, 27వ పద్యం లోని చిమ్మన గొట్ట మందు యెగజిమ్ము, 33వ పద్యము లోని తలఁకని చిత్తమున్, 38వ పద్యం లోని కులకులఁ గూయు పక్కిగమి, 45వ పద్యము లోని నగుమోము, 57వ పద్యము లోని పూసిగవాడ నీకు, 70వ పద్యము లోని నాజూకుగ, 72వ పద్యము లోని బత్తెములు, 76వ పద్యము లోని కూచులు, 81వ పద్యము లోని పెను రుజ, 84వ పద్యము లోని పెట్టని కోట, 88వ పద్యము లోని తలయొగ్గు, 94వ పద్యము లోని మాపులఁ బవలున్, 96వ పద్యము లోని పట్టు సేయుటీ, 108వ పద్యము లోని వాచవి, 110వ పద్యము లోని వేల్పుబువ్వ, 111వ పద్యము లోని బంటు బంట, 124వ పద్యము లోని బిరాన, 131వ పద్యము లోని సొద, జాలి, చిట్టెక్కుట, 135వ పద్యము లోని టక్కరి, తెక్కలి.

అన్య భాషా పదములు: 44వ పద్యం లోని నఫా, యాది, ముసీబత్, నదారద్, 124వ పద్యం లోని హుజూరు, కర్జు

8. శతకము భక్తి ప్రధాన మయ్యును, శరణాగతి నర్థించినను, కొంతవరకు స్వవిషయములను, కొంత సంఘ సంస్కరణ విషయప్రాధాన్యములను, లోక రీతిని, కొన్ని నీతి బోధక సద్విషయములను రచయిత నిర్మొహమాటముగా వివరించిరి. పఠిత లీ విషయములు గ్రహించఁ గలరు.

ఉదాహరణములు: 51, 91, 100, 101, 106 క్రమసంఖ్యలుఁ గల పద్యములు – యిత్యాదులు.

9. భక్తిప్రపన్ను లగు వారి యగచాట్లను వివరించిరి.

ఉదాహరణములు: 48వ పద్యము: దండము స్వామి వారు; 49వ పద్యము: అనయము నేను; 131వ పద్యము: ఎక్కువ విన్నపింపఁ గల.

10. దేవుని యిక్కడక్కడ బయట వెదకరాదనియు, తన యాత్మ యందే దర్శింపఁ దగుననియు, భక్తుల దరిఁ జేర్చి కృపతో స్వామి తనంతట తానుగా యరుదెంచి యార్తిఁ దీర్చుననియు, పలు పూర్వ భక్తుల గాధల నుదాహరణముగాఁ జూపిరి.

ఉదాహరణములు: 17వ పద్యములో అహల్యను, 18వ పద్యములో విభీషణుని, 19వ పద్యములో గుహుని, 20వ పద్యములో శబరిని, 21వ పద్యములో ధృతరాష్ట్రుని, 22వ పద్యములో ప్రహ్లాదుని ఉదాహరణములు ఇచ్చినారు.

11. శతకముతో పాటు వారు ఆత్మజ్యోతిని, శ్రీరాముని, మారుతిని, సీతామాతనుఁ గూర్చి మనోహరముగా రచించిన రాగ తాళ యుక్త భజన కీర్తనలు కూడా ఇవ్వబడ్డాయి. పఠితలు స్వయముగా చదివి ఆయా వివరములను గ్రహించి ఆస్వాదింతురుఁ గాక!

ఇట్లు,

రాజమహేంద్రవరం (న్యూఢిల్లీ)
27-09-2025

సాయి పదపద్మ పరమాణువు
చిరువోలు విజయ నరసింహా రావు

ప్రథమ ముద్రణలో రచయిత వ్రాసిన పీఠిక

కలవారి దేవుళ్ళు, లేనివారి దేవుళ్ళు, వ్యాపార సంస్థలుగా మారిన దేవుళ్ళు - రకరకాలుగా ఉన్నారని నాకు తెలుసు. నాకు 'దేహమే దేవాలయ' మని తెలిసినా, గ్రామస్తుల కోరిక (బ్రాహ్మణ భక్తులు) ననుసరించి రామాలయ నిర్మాణం, ప్రతిష్ఠలు జరిగాయి. చాలా నిర్లిప్తంగా వ్యవహరించాను. ప్రస్తుత పరిస్థితిని చూడగా, దానిని ప్రతివారు తమ స్వంత ఆస్తిగా చేసుకోవాలనే చూపు తప్ప భక్తి శ్రద్ధలు శూన్యం. కొబ్బరి చెట్లు వేసి, పోషించి, కాయించాను. దొంగతనంగా కొట్టుకుపోయి (పిందెలతో సహా) తినడమే కానీ, నివేదన, ఫలహార వినియోగం చేయాలనే ప్రయత్నం, లేక ఉద్దేశ్యం కనపడదు. ఇక నా వయస్సు అస్తమాన దిశ చేరుతోంది. అందరికి ఒక నమస్కారం చేసి ఊరుకుంటాను. ఆ ప్రభువు ఎట్లా చేస్తాడో ఆయనకే వదలి, ఆయననే "అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ" అని విరమిస్తాను.

చిరువోలు　　　　　　　　　　రామానంద జ్యోతి

03-03-1982　　　　　　　　సన్యసించక ముందు చిరువోలు దుర్గాప్రసాదరావు

రచయిత

మొదటి ప్రపంచ తెలుగు మహాసభలకు 1975వ సంవత్సరంలో సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో నాటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవియైన కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారికి రచయిత వ్రాసిన లేఖలో లేవనెత్త బడిన ప్రశ్నలు, సారాంశము:

1. తెలుగు - ఆంధ్రము ఒకటేనా?

2. మనము వాడే భాష ఆ రెంటి సంకరము కాదా?

3. అచ్చముగా తెలుగు పండితు లున్నారా?

4. సంస్కృతంలో పాండిత్యం (అనగా అమరకోశం - శబ్దకోశం)తో ప్రారంభించి గడించినాక తెలుగులో శ్రమించి పండితు లౌతారా? తెలుగు పాండిత్యార్జనకు వేరే మార్గ మున్నదా?

5. ఆంధ్రము - తెలుగు ఒకటే అయితే అచ్చ తెలుగు కృతు లెందు కేర్పడినవి? భాషాభిమానం దురభిమానంగా మారవచ్చా?

6. అభిప్రాయ ప్రసారణకే భాష అయినప్పుడు 'ప్రపంచ తెలుగు', 'ప్రపంచ తమిళ', వగైరా మహా సభల అవసర మేమిటి? అర్థ మేమిటి?

7. ప్రపంచ తెలుగు మహాసభలు - అర్థ మేమిటి?

8. తెలంగాణా తెలుగును అనాగరికంగా అపహాస్యం చేయవచ్చా?

9. నిజమైన తెలుగు తెలంగాణాలోనే ఉంది. ఆంధ్రము సంస్కృత భవము, జన్యం కాదా?

ఆస్థాన కవులు, మహా కవులు, పండితులు ఆసక్తి ఉంటే వివరిస్తారు. మరియు, సంస్కృత ఛందస్సులో లేని అనేక నియమాలు యేర్పరచుకొని నిర్వహించిన ప్రజ్ఞామూర్తు లాంధ్ర కవులు. వారికి వందన శతములు.

రచయిత వ్రాసిన కొన్ని భజన కీర్తనలు

1. జంపె తాళము:

నాలోన భాసిల్లు, నా దైవరాయ!
జ్యోతిపై విలసిల్లి, చూపవే వెలుగు,

విశ్వ శ్రేయమెఁ గోరు విజ్ఞాన మొసగి,
అజ్ఞానమునుఁ బాపి, ఆదుకో తండ్రి! ||నాలోన||

లోకోపకార పరలోల బద్ధునుఁ జేసి
లోపములు రానీక, కాపాడరా తండ్రి! ||నాలోన||

త్యాగబుద్ధి నొసంగి ధీబలముఁ గూర్చి
తీర్చి దిద్ద గదయ్య, దేవ దేవేశ! ||నాలోన||

చిరువోల్పురీధామ శ్రీసీతరామ!
కోదండ ధర రామ! నా కండ గావె, ||నాలోన||

2. ఆట తాళము:

నా తండ్రి రామయ్య! నీ కన్న దిక్కెంక నా కెవరు లేరయ్య
చిత్త శాంతినిఁ గోరి చేకొన్న నియమాళి
జీవిత ఘర్షణల చిక్కి చెదరకుండ ||నా తండ్రి||

కామ క్రోధాదుల కైపులో చెలరేగి

కాని కృత్యము సల్పి గౌరవము చెడకుండ ॥నా తండ్రి॥

రాగద్వేషాదుల రభసలో బడి మునిగి

వేగ వివేకవిహీనుడను గాకుండ ॥నా తండ్రి॥

లోభ మోహాదులలో దవిలి లోలుడనై

లోకువయై నగుబాట్లకు లోనుగాక యుండ ॥నా తండ్రి॥

యోగక్షేమము లిచ్చి యొద్దికతోఁ బ్రోచే

ప్రభుడవు నీవని భక్తితో భజియింతు ॥నా తండ్రి॥

దేహదార్ఢ్యము నిచ్చి ధీశక్తిఁ గూర్చి

దీక్షతో కర్తవ్య దక్షునిగాఁ జేసి ॥నా తండ్రి॥

జోగి రామానంద జ్యోతీ సంసేవిత

ధర చిరువోల్పురధామా కోదండరామ! ॥నా తండ్రి॥

3. ఆది తాళము:

కోదండ రామునిఁ గొలువవే, మనసా!

కోటి జన్మలకు ఫల మిది మనసా!

ధరణిలో నరులకు తార్కాణముగా

దశరథ సుతుడై తా జనియించెనె ॥కోదండ॥

పితృవాక్య పరిపాలన కొరకై

ధరణీపాలన తా త్యజియించెనె ||కోదండ||

ఉడుతకు, కోతికి, ఋక్ష పక్షులకు

పెక్కు సేర్వకయె దక్కెను మోక్షము ||కోదండ||

పదరజ స్పర్శచే పాషాణమునే

పడతిగఁ జేసిన పావనమూర్తిని ||కోదండ||

శబరి కతిథియై చవిగొని పండ్లను

మోక్ష మొసంగిన ముక్తిదాయకుని ||కోదండ||

వైరి సోదరుడు వచ్చి శరణ మన

వేరు సేయకయె వేగమెఁ బ్రోచిన ||కోదండ||

జోగి రామానంద జ్యోతి సన్నుతుని

చిరువోల్పుర వరు సీతారాముని ||కోదండ||

4. ఆది తాళము:

వాయు సుతా హనుమంతా! మముఁ బ్రోవుము ధీమంతా!

సదయ హృదయ! మీ మృదు పదములు నా

హృదయ కమలమున వదలక నిలిపెద, ||వాయు||

బ్రహ్మచర్య వ్రత పాలనశీలా!

బ్రహ్మతేజ విభ్రాజిత ఫాలా! ||వాయు||

రామదాస వర! రామకార్యపర!

కామితార్థ ప్రద కరుణావార్ధీ! ||వాయు||

జోగి రామానంద జ్యోతి సన్నుతా!

ధర చిరువోల్పురధామ పావనీ! ||వాయు||

5. ఆది తాళము:

మారుతి రావేలా! నన్నేలా! మారుతి జాగేల

రామ కథా సుధా లీలాలోలా!

మారుతి రావేలా, నన్నేలా, మారుతి జాగేల! ||మారుతి||

రామదాసులను రయమునఁ బ్రోచే

నీమము నీయది నిజము మహాత్మా! ||మారుతి||

రామదాసుపై లంకకు వడిఁ జని

సీతా మాతకు శ్రేయముఁ గూర్చిన ||మారుతి||

మూర్ఛా సమ్మోహితుడగు లక్ష్మణు

జీవము నిల్పి సంజీవినిఁ గూర్చిన ||మారుతి||

జోగి రామానంద జ్యోతి సన్నుతా!

ధర చిరువోల్పురధామ పావనీ! ||మారుతి||

6. హారతిఁ గైకొనుమా:

హారతిఁ గైకొనుమా! అమ్మా! సీతమ్మా! హారతిఁ గైకొనుమా!

హారతిఁ గైకొను నాత్మ విభునిఁ గూడి
ఆనందముతో అతివ లొసంగెడి ||హారతిఁ||

జనక భూమీశుని జన్మ తరింపగ
జనియించిన జగజ్జననీ! జానకి! ||హారతిఁ||

నిర్గుణ రాముని నిజ సతివై తగి
శత్రుమర్దనునిఁ జేసిన శక్తీ! ||హారతిఁ||

హనుమ వాల శిఖి అతి శీతలమగు
చందనచర్చగ సలిపిన జననీ! ||హారతిఁ||

పావక జ్వాలల పాతివ్రత్యము
ప్రకటించిన ఘన భవ్య చరిత్రా ||హారతిఁ||

జోగి రామానంద జ్యోతి సన్నుతే!
యోగీశ్వరేశ్వరీ! యోగదాయినీ! ||హారతిఁ||

చిరువోల్పుర వరు శ్రీరామచంద్రునిఁ
గూడి జగంబుల నేలెడి తల్లీ! ||హారతిఁ||

శ్రీ రామభద్ర శతకము

ఉ ll శ్రీకరి గౌరి శ్రోత యట, శేష విభూషుడు వక్త యంట, మో
క్షైక ఫలప్రదం బినకులేశుని సత్కథ భాష్య మంట, ము
ల్లోకము లాత్మరాము కథలో పులకించి తరించె నంట, రా
వో కరుణించిఁ బ్రోవ, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 1

ఉ ll నీ కథ సర్వలోకముల నిండి వెలుంగుచు ప్రాణికోట్ల క
స్తోకము పాపహారియయి శోభనముల్ దయచేయు నిత్యముస్
నీ కమనీయ నామ జప నిశ్చలుడస్, ననుఁ గావ వేగ రా
వో! కరుణాబ్ధి వౌచు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 2

చం ll శరణము రామచంద్ర! బుధసన్నుత! సద్గుణకీర్తిసాంద్ర! వే
శరణము దీన బాంధవ! ప్రసాదగుణామృత! దివ్యభావ! నే
శరణ మటంచు వేడితి, విచారముఁ దీర్చి బిరాన నన్నుఁ బ్రో
వు, రవికులాబ్ధి చంద్ర! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 3

చం ll శరణు మహాప్రభూ! చరణ సన్నిధిలో పడియుండువాడ, సం
సరణ మహాబ్ధి దాటగ నశక్తుడనై మిము వేడుకొంటి నా
దొరవని, మోక్ష మీయఁదగదో శరణార్థిని, నన్ను వేగఁ బ్రో
వు, రవికులాబ్ధి చంద్ర! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 4

చం ll శరణు మహాప్రభూ! శరణు శర్వ సమర్చిత దివ్యనామ! సా
దరమునఁ జేరఁదీసి పదతామరసమ్ముల చెంతఁ జేర్చి కిం
కరుడుగ నన్నుఁ దీర్చి లయకారుని బారి భయంబుఁ బాపిఁ బ్రో
వు, రవికులాబ్ధి చంద్ర! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 5

చం ॥ శరణము శర్వ సన్నుత! లసచ్చరణాంబుజయుగ్మ! నీ కిదే
శరణము గాధిరాట్సుతుని జన్నముఁ గాచిన యట్టి జెట్టి, వే
శరణము స్త్రీ యహల్యకును శాపముఁ బాపిన పూజ్యపాద! బ్రో
వు, రవికులాబ్ధి చంద్ర! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 6

చం ॥ శరణముఁ గావు మన్న నిముసంబున కాకముఁ గాచినావు, నీ
శరణముఁ గోరినట్టి కపిసత్తము నార్కిని యోమినావు, నీ
శరణ మటన్న వైరి యనుజన్ము విభీషణుఁ బ్రోచినావుఁ గా
వు రఘు కులేశ! నన్ను, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 7

చం ॥ ప్రభుడవు నీవు, నా హృదయపద్మము నందు వసించి నావు, దు
ర్లభముఁ గదా సదా మదిని లక్ష్యము నిల్పి జపించుటన్న, మీ
శుభకరమూర్తి నొండు ప్రజ సొక్కి భజించగ కోవెలందుఁ బ్రో
వు, భవము బాధ డుల్చి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 8

ఉ ॥ రాకొమరుండ వయ్యు గుణరాశివిగా వెలుగొంది, నమ్రతా
శ్రీకరమూర్తివై గురులఁ జేరి సమస్తము నేర్చి, తండ్రి క
న్నాకుక సంచరించి, భువనాళికి మార్గముఁ జూపినావుఁ గా
వో, కరుణాబ్ధివౌచు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 9

చం ॥ ప్రభువర! నీ నివాసమును భద్ర నగంబునఁ గట్టి, ధన్యుడై
యుభయ పథంబులన్ గెలుపు నొందిన గోపనగారి సాటిగా
రభస పడంగ నెంచి, ప్రచురంబుగఁ బూనిన పద్దుఁ గాదు, నీ
వు భరణ ముంటి వంచు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 10

ఉ ॥ ఒక్కటె మాట, బాణమును నొక్కటె, యొక్కతె పత్ని, యన్న యా
చక్కని దీక్ష నీకె తగె, సంభవమా యొరు లందు నెన్న డేన్?
నిక్కము దీనరక్షణయు నీ శపథంబె, భవార్తు లందు నన్
పుక్కటఁ బ్రోవుమయ్య, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 11

ఉ ॥ చల్లని చూపు నాపయి ప్రసారముఁ జేసెడు కన్నతల్లి, నీ
యుల్లము రంజిలన్ పదము లొత్తుచు ముచ్చట లాడు వేళ, యీ
పిల్లనిఁ గావు మంచు వినిపించిన విన్నప ముండ, వేరు దే
వుళ్ళకు మ్రొక్క నేల? చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 12

ఉ ॥ ఓయి దయామయా! మనుపవోయి భవత్పదదాసుడన్, తగు
ల్బాయని కర్మ బంధముల బల్మికిఁ జిక్కి విపత్తి నొంది, మ
చ్ఛ్రేయమెఁ గోరు పెద్దలను ధిక్కృతిఁ జేసితి, బుద్ధి వచ్చె, రా
వోయి, యుపేక్ష యేల? చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 13

చం ॥ తగదటె నన్నుఁ బ్రోవ బహుధా సచరాచర జీవకోటికిం
దగు సకలంబుఁ గూర్చి విదితంబుగఁ బ్రోచెడి కన్న తండ్రి! యీ
దగు కరుణార్ద్ర దృష్టి నిడి ధన్యునిఁ జేయ కుపేక్షఁ జేతు వీ
వు, గురుతు రాక యున్నె, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 14

ఉ ॥ మున్ను శ్రుతుల్ నుతించెను యమోఘ వచస్సున నిన్నె, నవ్యయుం
డున్నతు, డాద్యు, డాఢ్యుడు, గుణోత్తరు డార్త శరణ్యు డంచు, నీ
వన్నిట నిండి వెల్గియును నైతివి నిర్గుణమూర్తి, వెన్న మా
పున్నెముఁ గూర్చిఁ బ్రోవు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 15

చం ॥ కనుఁగొను టెన్నడో కనులుఁ గల్గిన దానికి తగ్గ సత్ఫలం
బునుఁ గను నట్లు మౌనివర పూజిత దివ్య పదాబ్జ యుగ్మముస్
కనుఁగొను టెన్నడో, మిము నఖండ మహా రుచిరప్రపూర్ణ రూ
పుని, భవబంధ మూడ్చ, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 16

ఉ ॥ ఎన్నడుఁ గల్గునో గుహుని కీప్సిత మిచ్చి తరింపఁ జేసి, యా
పన్న శిలాస్వరూప ఋషిపత్ని యహల్యకు శాప మూడ్చి, రా
జన్నవలా స్వరూప మిడి శాశ్వత కీర్తినిఁ గొన్న నీ దరిస్
పున్నెముఁ జేర్చుఁ గొల్వ, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 17

చం ॥ నినుఁ గను పేడ్క భ్రాంతిమతి నిల్కడ లేక చరింప నేల రా
వణుని సహోదరుం గరుణ వర్ధిలఁ జేయగ లంక కేగపే
యనుపమ సత్కృపా గరిమ నద్భుతమౌ, శరణార్థినయ్య, నీ
వు ననుఁ దరింపఁ జేయు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 18

చం ॥ నిను దరిసింపఁ గోరి తగు నేరుపు లేక భ్రమింప నేమగుస్?
తన కులధర్మ నిర్వహణ తత్పరు నా గుహుఁ జేరిఁ బ్రోవవే,
యనుపమ ప్రేమ దృగ్విలసనార్భటి నా క్రియఁ బ్రోవుమా, దయాం
బునిధివి నన్నుఁ గాంచి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 19

చం ॥ నినుఁ గను కోర్కె భ్రాంతమతి నిల్కడ లేక చరింప నేమగుస్?
మును శబరిం బ్రసన్నత సముద్ధరణం బొనరింప నీవయై
వనమున దర్శనం బిడవె, వాస్తవ మింతె, దయాతరంగ! నీ
వు నెనరుఁ జూపవయ్య, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 20

చం ॥ నినుఁ గను నాసఁ బర్వులిడ నేరక యజ్ఞుడు పుట్టుచీకు, యై
ననుఁ గనె మున్ను తాను కురునాథుడు, నీదగు విశ్వరూప మే
ఘనుని తరింపఁ జేయఁ గృపఁ గల్గునొ నీ కత డెన్న ధన్యు డీ
వు నెనరుఁ జూపవయ్య, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 21

ఉ ॥ నీ దగు దర్శనార్థ మవనిం బెడఁ ద్రిమ్మర నేల? మున్ను ప్ర
హ్లాదుని మాతృగర్భగతు నంచిత భక్తుని ధన్యుఁ జేసి నీ
వాదుకొనంగ లేదె దనుజాధిపుఁ ద్రుంచు నృశింహ మూర్తి వీ
వో! దనుజాపహారి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 22

ఉ ॥ కప్పుర మందు తావి, కనకంబున కాంతియు, చల్వ గంధ మం
దుప్పునఁ గారు నవ్య కుసుమోత్కర మందున తేనె వాఁకయుస్
యప్పున మానహాని, కవు లందున యూహయుఁ గూర్చినావు, యీ
యొప్పను జ్ఞాన మట్లు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 23

ఉ ॥ కొప్పుకు పూలు, కోమలికి కొంచెపు సిగ్గును, చేతి కీవియుస్,
దుప్పికి కొమ్ము చిల్లలును, ధోవతి కంచులు, కండ్ల కాటుకల్,
పప్పుకు నేతిబొట్టు, మృదుభాషకు సత్యము, భక్తి కార్తియుస్,
బొప్పని చేష్ట లౌనె, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 24

ఉ ॥ కమ్మని వాక్ప్రసూనములు, గాఢ మహత్తర భక్తిభావ పూ
ర్ణమ్ములు, మంజులమ్ము, లభిరామ మనోజ్ఞము లేర్చి కూర్చి, మా
బమ్మెర యన్న మీ కొసగె భాగవతమ్మును, యద్ది నేడు యౌఁ
బొమ్మను భాగ్య మయ్యె, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 25

చం ॥ మృదుమధురస్వరమ్ము జగమే మరపించెడి ముద్దుపాటయున్,
ముద మొనఁగూర్చు పాండితియు, ముచ్చటఁ గొల్పెడి సత్కవిత్వమున్,
గదిసిన త్యాగరాజునకెఁ గల్గెను భక్తియు, దిష్ట మివ్విధిన్
బొదవునె ప్రాప్తి లేక, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 26

ఉ ॥ చిమ్మన గొట్ట మందు యెగజిమ్ము వసంతముఁ బోలు భావముల్
నెమ్మన మందు నిండి కమనీయ సుధామధురప్రసాద తు
ల్యమ్ములు నాదు జిహ్వ యమలంబుగఁ బల్కగ నిన్నెఁ గొల్తు, నన్
బొమ్మన కయ్య! స్వామి! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 27

ఉ ॥ ఇప్పటి కెన్ని సార్లొఁ గబళింపఁ దలంచియు మృత్యు వెందుకో
గుప్పిడి జార్చి మళ్ళుకొనె, కొండొక కర్జము కద్దొ యేమొ, నా
చప్పిడి జీవితంబునను, స్వామి! యదేమొ యనుజ్ఞ యిమ్ము, యీ
పుప్పము వాడు టెప్డొ, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 28

ఉ ॥ చెప్పిన చేయ లేడొకడు, చెప్పకఁ జేయడు వేరొకండు, యే
మెప్పునుఁ గోరఁబోడు, తమి మీర స్వబుద్ధి నొనర్చు నూడిగాల్
తప్పను కోని స్వామికయి దాసులు, మూడవ జాతి వారు, యీ
బొప్పని సేవఁ గొమ్ము, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 29

చం ॥ కనక ధరాభ పైభవముఁ గల్గియు నిర్దయులైన స్వార్థులన్
కనికర మెంచి కంట తడిఁ గల్గియు నర్థము లేని వ్యర్థులన్
కను గొన లందు ప్రాణములుఁ గల్గిన దీనుల సృష్టిఁ జేసినా
వు, నెనరుఁ గల్గు తండ్రి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 30

ఉ ll నన్ను పరీక్ష సల్పఁగ మనంబున కోరిక కద్దొ యేమొ, నే
నన్నిటికిం దెగించితి, ననాదరణంబున నేమి వచ్చె? వి
ద్వన్నుత! సచ్చరిత్ర! నను పైళమ చేకొనిఁ బ్రోవకున్న, యీ
పౌన్నరి కేది దిక్కు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 31

చం ll భవ జలధిం దరింప నినుఁ బల్మరు వేడెద నయ్య, పద్మసం
భవ భవ ముఖ్య దేవ నుత పాద పయోరుహ! నిన్నుఁ గొల్వ ప్రా
భవ మిడి మున్నుఁ బ్రోవవె యభాగ్యుల, నన్గృపఁ జూడ వయ్య నీ
వు, వరద! దేవదేవ! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 32

చం ll తలఁకని చిత్తముస్, చలము తగ్గని దీక్షయు, దేహదార్ఢ్యముస్,
విలసిత బుద్ధి వైభవము, వీసర వోవని సత్ప్రయత్నముస్,
చెలువగు మీ పదాబ్జయుగ చింతనముస్, దయ చేసిఁ బ్రోవు మీ
వు, లలితపాదపద్మ! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 33

ఉ ll సింగమనీని సైన్యమును చిందరవందరఁ జేసి పోతనస్
భంగ పడంగ నీక మును పాలనఁ జేయవె బంటు నంపి, నా
సంగతి కంపు దుష్టజన సాహస చర్యలఁ దూల్ప దాసులస్
పుంగవు నాంజనేయు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 34

చం ll శుభకర నామ! మిమ్ము నెద చొక్కి భజించుచు నుంటినయ్య, నే
విభవము లాస చేయ, నవివేక పథంబుల మాన్పిఁ బ్రోవగా
నభయ మొసంగుమయ్య, శరణంటిని నీ పద మంటి, తండ్రి వీ
వు, భయ మదేల నాకు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 35

చం II ఇభ వరదా! దయాశరధి! హే రఘుపుంగవ! రామచంద్ర! శో
కభయ విమోహదూర! శుభకారణ శోభన నామ! రామ! నా
కభయ మొసంగుమయ్య, శరణాగతవత్సల! దేవ! యేలరా
వు, భయవినాశ! ఈశ! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 36

ఉ II భక్తుల కెప్పుడుస్ గలుగు బంధ విమోచన మన్న యాసతో
ముక్తినిఁ గోరి నిన్నె సతముం బ్రణుతించితి, సేవఁ జేసితిస్,
త్యక్తుడఁ గాను నేను, తమ దాసుని దాసుడ, నన్నుఁ బ్రోచి నా
భుక్తము నాకు నిమ్ము, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 37

చం II కులకులఁ గూయు పక్కిగమి కూజితముల్ మిముఁ బాడుచుండ, నీ
తెల తెలవారు వేళ వినుతించుచు భక్తులు పాడుచున్న మే
ల్కొలుపులఁ జిత్తగించి కనుగోఁదగు, కన్నులు విచ్చి లోకముల్
వొలుపుగ వర్ధిలంగ, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 38

చం II అలిగితి వేమొ స్వామి! యటు లౌటకు మా యెడ నేర మేమి? మీ
కొలువున నప్రమత్తత, నకుంఠిత భక్తిఁ జరించుచున్న నా
కొలదికి మించు నేర మది కొంత ఘటిల్లిన నస్ క్షమించిఁ బ్రో
వు, లలితహృత్సరోజ! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 39

చం II మరచుట లేదు మిమ్ము, కొఱ మాలిన దేహ ధనాది యైహిక
స్ఫురణము కొంత మళ్ళెను, ప్రబోధము నొందిన యాత్మ దీప్తమై
తిరుపథ మందు సాగి చనుదెంచెను నీ దెసఁ, జేరఁదీయు మీ
ఋరుకని ప్రీతి తోడ, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 40

చం ll భరమయి తోచె సంసరణ భారము మోపగ లేను రామ! దు
ర్భరముఁ గదా! పునర్జనన ప్రాపిత గర్భ నివాస నారకం
బరరె! తరించు టెట్టు లసహాయుడ, దాసుడ! నన్నుఁ బ్రోవు, వి
స్ఫుర దరవిందనేత్ర! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 41

చం ll తలపున నిల్చి నా హృదయ తామరసంబు ప్రఫుల్ల భావ సం
విలసితమై రసార్ద్రము నవీన మరంద రసప్రపూర్ణమై
యలర సుగంధ బంధురము నౌనటు నిత్యముఁ జేయుమయ్య నీ
వు, లలితహృత్సరోజ! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 42

చం ll శ్రమ మనుకోక రమ్ము! తమ సన్నిధి కిన్నను జేర్చుకొమ్ము, నీ
మముఁ దగ నిల్చుకొమ్ము, చనుమానముతో మిముఁ గొల్వ నిమ్ము, శ్రే
యము శరణార్థి కిమ్ము, నను నారడిఁ బెట్టిన నొట్టు సుమ్ముఁ, బ్రో
వుము తమ బంట, నమ్ము, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 43

చం ll పలువురు మిమ్ము వేడిన "నఫా" యొక యించుకఁ గల్గదాయె, నీ
యలుకకు కారణం బరయ "యాది"కి రాక "ముసీబతా"యె, నీ
కొలువుకు మించి దిక్కగు "హుకూమతు" లెన్న "నదారదౌ"నుఁ బ్రో
వు, లలితహృత్సరోజ! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 44

ఉ ll నమ్మితి స్వామి మిమ్ము, నెఱనమ్మితి మీ చరణద్వయమ్ము, నే
నమ్మితి దీనరక్షణ చణంబగు మీ శరచాపహస్తముస్,
నమ్మితి మీ కటాక్ష, మెద నమ్మితి మీ నగుమోము గోము, నన్
బొమ్మన కీవుఁ గావు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 45

చం ll ఘనులగు పూర్వ సత్కవు లఖండ యశో విభవాభిరాములై
మునుపు రచించినారు భవమోచనమౌ భవదీయ సత్కథల్
వినుతి యొనర్చి, వానికి ద్రవించి స్రవించెను రాళ్ళుఁ గూడ, కా
వున వినుతింతు వారి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 46

చం ll మును పొక మాయలేడి మిము మోసముఁ జేసి తపింపఁ జేసె, మీ
యనుపమ సాయకమ్ములకు నందియు నందని దయ్యె నద్ది, నస్
పెను వెతఁబెట్టు చిత్తమను పేరిటి మాయమృగంబుఁ జెండి దె
బ్బున ననుఁ బ్రోవు మయ్య, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 47

ఉ ll దండము స్వామివారు, తమ దాసుని విన్నప మాదరించు దో
ర్దండ మహోగ్ర ధార్మికులు తామట, నస్ భ్రమ లోని కీడ్పు నీ
మొండి శిఖండి చిత్తమను ముష్కర మాయ మృగంబుఁ గూల్చిఁ బ్రో
వుండు జితారివీర! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 48

చం ll అనయము నేను మీకు శరణార్థునిగాఁ బడియుండిఁ గూడ నే
మనఁగలవాడ, మీ కొరకు మాటికి మాటికి చేయిఁ జాపుచుస్
పనిఁగొని యర్థినై పరుల పంచన నిల్చుట పాడి యౌనె, పో
వునుఁ గద మీ కితాబు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 49

చం ll నిను నుతియించి నీ చరణ నీరజముల్ స్పృశియించిఁ బ్రోవు మం
చనితర భక్తితత్పరత నర్థి యొనర్పగ నేలుకొంట లే
కనయము తోటి మానవుల కర్థితుగా నొనరించి నావుగా,
పొనరని దెద్దీ నీకు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 50

చం ll చదువరులై, సమర్థులయి, చాతురిఁ గల్గు సుహృత్తులౌ ముదా
స్పదులు తొలంగి పోవ, హితభావమునస్ గనువారు లేక, నా
హృదయము విప్పి చెప్పిన గ్రహించు రసజ్ఞులు లేకఁ గుంద, బు
ద్బుదమయె నా ముగింపు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 51

ఉ ll భోగము లాస చేతు ననఁ బోలదు, కాదని మాన రాదు, సం
యోగ వియోగముల్ హృదయ మూఁచి కలంచును, త్రోవ లేను, పెస్
రోగము స్వార్థముస్ విడుచు రోజది కానగరాదు, దేవ! యీ
బూగర కీవె పూఁట, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 52

ఉ ll భోగిని చేతువో, కడుపుఁ బ్రోవగ లేని దరిద్రుఁ జేతువో
రాగినిఁ జేతువో, కడు విరాగినిఁ జేతువొ, మోహవార్థిలో
యూగెడి భ్రాంతుఁ జేతువొ, మదోద్ధతిఁ జెండిన జ్ఞాని సేతొ, నా
భోగము క్షేమ మీవె, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 53

ఉ ll లేశము బొంకు లేదు, దయ లేదె, శరణ్యుడ వీవు నాకు, నే
దేశము నందు నున్న ననుఁ దేల్చెడి తెప్పవు నీవు, మోసపుస్
వేసము కాదు నమ్ము, కడు విశ్వసనీయము నాదు వాక్కు, నా
ర్యేసిన నీవెఁ బ్రోవు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 54

ఉ ll వీసము బొంకు లేదు, రఘువీర! భవత్పద భక్తియుక్తి నేఁ
జేసితి సేవ నిత్యము, నశింపగఁ జేయుమి నాదు పాపపుస్
రాసుల, నన్య మే నెరుగరా, కరుణింపర, మోక్ష మీయరా
వో! సురముఖ్య సేవ్య! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 55

ఉ ll వంచన సుంత లేదు, రఘువల్లభ! నీ చరణద్వయంబు నా
సంచిత భాగ్య మంచు ననిశంబును నమ్మిఁ ద్రిశుద్ధిగా పరా
కంచు భవద్భవంబనుచు ప్రాంగణసీమ వసించుచుంటి, నే
వొంచులిడంగ కద్దె, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 56

ఉ ll హాసము చేయు వారు, పరిహాసముగా కనుగీటి వ్యంగపుం
బాసలు పల్కు వారు, తగుపాటి వదాన్యత చూపలేని యా
క్రోశుల జోలి యేల? గుణకోవిదులై మెరసేటి దాతలన్
పూసిగవాడ నీకు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 57

చం ll కడుపుకు లేక తిట్టె ముని కాశిఁ బరాశరి, నట్లె యేనునుం
గడు వెత నొంది యార్థికపు కాటక బాధకు నోర్వ లేక వా
విడిచితి హద్దు మీరిఁ, గనవే దయ తోడుత నన్, క్షమించి, య
ర్భుడ నని! శ్రీరమేశ! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 58

చం ll అడుగుట దోస మంచెరిగి యార్థిక బాధకు తాళ లేక నే
నడిగితి విద్దె సెప్పి, యటులైనను తీరదు నా యవస్థ, తో
చెడు నది యిచ్చు వానిని సృజింపక పోయెను మాయ బ్రహ్మ, భూ
పుఁడ! యిడుమయ్య భుక్తి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 59

చం ll గడువదు పూట యర్థ మదిఁ గల్గకఁ జేతను, నద్దిఁ గల్గు గ
ణ్యుడు కృతపూర్వపుణ్యుడు, ప్రయోజన శూన్యము యర్థశూన్యపుం
బడుగుల జీవితం బగుట, ప్రార్థనఁ జేసెదనయ్య, వైరికేన్
బుడమిని వద్దు లేమి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 60

చం ॥ చెడును వ్రతంబు, నిష్ఠయును చేడ్పడు, శాంతియు దాంతి మృగ్యమౌ,
బొడవటు ధ్యాన నిష్ఠలును, పొల్పఱు సద్ధృతి, తగ్గు తేజముస్,
యడఁగని యాగ్రహం బనగ నగ్ని సమం, బదిఁ గాల్చు సర్వముస్,
పొడవడగించ రావె, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 61

చం ॥ కడు వడి మీ పదంబులనుఁ గాంచ కుతూహల మానసుండనై
తడవితి మీ చరిత్రమును, తావక భక్తి ప్రపత్తి యుక్తి మీ
యడుగుల యాన మాన, నను నాశ్రితు వత్సగఁ జూచిఁ బ్రోచు భూ
పుఁడవని నమ్మి తయ్య! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 62

ఉ ॥ రమ్ము! కటాక్షవీక్షణ భరమ్మగు మీ నగుమోముఁ జూచు భా
గ్యమ్మునుఁ గల్గనిమ్ము, నవకంజ విలాసము లీను పాద ప
ద్మమ్ములఁ జూడ నిమ్ము, నెద తత్పరతం భజయింప నిమ్ము, నస్
పొమ్మన కుండ నిమ్ము, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 63

ఉ ॥ రమ్ము! మహాత్మ! దీనజన రక్షక! దుర్జనపక్ష శిక్షకా!
రమ్ము! సమర్చితాంఘ్రియుగ రాజ శిఖామణి! రమ్ము ధీమణీ!
రమ్ము! మదీయ హృత్సదన రాజిత దివ్య పతంగ బింబ! నా
బొమ్మర మాన్ప రమ్ము! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 64

ఉ ॥ రమ్ము! ప్రభాకరాన్వయ పురాకృత పుణ్య విశేషభాగ్యమా!
రమ్ము! పురారి ముఖ్యనుత రాజిత పావన నామ! ముద్దుగా
రమ్ము! మదీయ మానస మరాళమఁ! గ్రన్నన నన్నుఁ జేరి యొఁ
బొమ్మనిఁ జెప్ప రమ్ము, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 65

ఉ ll రమ్ము! సురారి వీర నికరమ్ములఁ గూల్చిన బాహు లెత్తి, వే
రమ్మని చేరదీసి నను రక్షణ సేయుము, చిమ్మి పాపముల్,
నమ్మితి మిమ్ము నింతకు వినా గతి శూన్యము, వేగ వచ్చి యోఁ
బొమ్మనిఁ బ్రోవ నన్ను, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 66

ఉ ll రమ్ము! కరీంద్రు నార్తి వినరా నరుదెంచిన సంభ్రమంబునన్,
రమ్ము! మదోద్ధతుల్ ద్రుపద రాజ తనూభవ కోక లూడ్వ భా
రమ్మనుకోక, కోక లిడి రక్షణఁ జేసిన యాత్ర మెంచి, నన్
బొమ్మన కుండ రమ్ము! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 67

ఉ ll శ్రీకరమై రహించు తులసీదళముల్ తమ పూజ కోసమై
నాకు లభింపఁ జేయుటకునై యిటు చేతికి కృష్ణకుల్యలో
చేకురఁ జేసినావె వనజేక్షణ విత్తులుఁ గల్గు వెన్ను, నీ
పోకడ లద్భుతంబు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 68

ఉ ll సాకరి వీవు యీ భువనజాలము లన్నిటికిం, బ్రసిద్ధమౌ
నీ కథ యయ్యు, యొక్కడును నిష్క్రియుడై పడియుండ దర్థియై
చాకిరి సేయు నేదొ యది సాజము, యేనట నొజ్జ నైతి, నా
పోకడ కూతఁ గమ్ము, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 69

ఉ ll లోక గురుండవైన ప్రబలుండవు, నీకొక డున్నె యొజ్జ? యే
దో కృపఁ జూచి కీర్తి నిడు త్రోవగ నాడు వశిష్ఠుఁ జేరి నా
జూకుగ విద్దె నేర్చితివి, చొప్పడునే నను బోంట్ల కిట్టి యా
పోక వికుంఠ లబ్ధి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 70

ఉ ll శ్రీకరమై, సమస్త శుభచిహ్న విరాజితమై, మనోజ్ఞమై,
ప్రాకట ఘోరపాతక విపాటన పాటవమై, ప్రపూజ్యమై,
లోక భయంకరాసుర బలోద్ధతి భంజకమైన పాద మే
భూకము నందుఁ వచ్చు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 71

ఉ ll నీ విడు నట్టి బత్తెములు నేఁ దిని, నీదగు సేవఁ జేయుటే
జీవిత లక్ష్యమై తనువు, చేతము, వాక్కును, నేకధారగా
గ్రావము నుండి జారు ఝురి కైవడి సాగుచునుంటి నిట్లు నన్
బ్రోవు కృతాబ్ధి వౌచు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 72

చం ll నిను మది నెంచి నీ చరణ నీరజముల్ భజియించి గీతముల్
నిను గురియించి పాడి, యతి నిర్మల భక్తిని నీదు సత్కథల్
తనివి సనంగ సెప్పి, విని, తత్పరతన్ పఠియించి సుప్తిలో
పొనరువడంగఁ గాంతు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 73

చం ll నినుఁ గను నాస నేరక వనిం జెడఁ ద్రిమ్మర నేల? మున్ను వా
మనుడుగఁ జేరి యా బలి నమానుష చర్యఁ ద్రివిక్రముండవై
మునుకొని యజ్ఞవాటి కడ మూడడుగుల్ గొన నేగిఁ బ్రోవవే
పొనర ముదాబ్ధి వౌచు చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 74

ఉ ll శ్రీ రవివంశ వారినిధి శీత మయూఖుని, జానకీ మనో
నీరజ బంధునిన్, నిఖిల నిర్జరలోక శరణ్యపాదునిన్,
దారుణ రావణాది బల దైత్య విఖండను, నిన్నుఁ గొల్చి, యా
స్ఫోరణ మందు నిల్తు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 75

ఉ॥ ప్రేముడి నాదు విన్నపముఁ బెట్టుము నీ చెవి, సర్వలోక ర
క్షా ముదితాంతరంగ! పరకార్యధురంధర! నన్నుఁ బోలు గా
రాముల కూచు లెందరొ, పరాకున నన్మరచేవు స్వామి, నీ
భూమిక వేరు కద్దె? చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 76

ఉ॥ గ్రామమొ, కాననంబొ, సుఖ కారణమైన నివాస భూమి భా
మామణి తోడి పొత్తొ, యతి మాన్యపు సన్యసనంబొ, భైక్షమొ,
భామిని చేతి వంటకమొ, బ్రహ్మ లిఖించిన ప్రాప్తిఁ దప్ప దే
బోమున నైనఁ గాని, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 77

ఉ॥ ప్రేముడి నాదు విన్నపముఁ బెట్టుము నీ చెవి, దుఃఖభాజనం
బేమనిఁ దెల్పువాడ, నతి హేయము నాదగు కష్టగాథ, శ్రీ
ధామముఁ గాని కొంప, సువిధాయినిఁ గానటువంటి భార్య, యే
భూమిక ప్రోదిసేతు? చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 78

ఉ॥ ప్రోవ సమర్థుడౌ పవన పుత్రుడు నమ్మినబంటుఁ గల్గ, సు
శ్రీ విజయప్రదాత్రి యగు సీత పతివ్రత భార్యఁ గల్గ, భ
క్తావన దీక్షఁ గల్గ, తమ యానతి మీరని తమ్ముడుండ, నన్
బ్రోవ భరంబటయ్య, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 79

చం॥ మొర వినవేర రామ! నగుమో మిటుఁ జూపి ప్రశస్త హస్తమున్
సరగునఁ జాపి నీ చరణ సన్నిధి కిన్ననుఁ జేరఁ దీసి యా
దరమునఁ జూడవేర! వరదాన మొసంగి భయంబుఁ దీర్చ, య
బ్బుర మటె దీనరక్ష, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 80

చం ॥ నిను నెరనమ్మినాడ, నవ నీరజనేత్ర! మదీయ పాపముల్
పెను రుజలై ననుం గలత పెట్టెడు, తాళగ జాల, నన్ను నే
యనువుననైనఁ దేర్చి తమ యండనుఁ జేర్చి తరింపఁ జేయవే,
పొనర ముదాబ్ధి వొచు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 81

చం ॥ నిను నెరనమ్మినాడ, నవ నీరజనేత్ర! ప్రసన్న దృష్టి నస్
గని యనిశంబుఁ బ్రోవుమి, యఘంబు లడంచుమి, యార్తిఁ దీర్చుమీ,
ఘనమగు నజ్ఞతా జనిత గాఢ తమంబును జ్ఞానదీప్తి ద
వ్వున కెగురంగఁ జేసి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 82

చం ॥ పరులకు మేలుఁ గూర్పఁ దగుపాటి బలంబును, బుద్ధివైభవం,
బరులకు జంకఁ బోక పొగరార్చెడి సార విశేష శౌర్యమున్
దరుగని నీ పదాబ్జయుగ తత్పర బుద్ధియుఁ గూర్చిఁ బ్రోవుమీ
పొరపడకుండఁ జూచి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 83

ఉ ॥ పెట్టని కోటపై నిలచి భీకర దుష్ట గ్రహాళిఁ ద్రోచి, చూ
పట్టిన విఘ్నపాశముల భంజనఁ జేసి, మదీయ కార్యముల్
నెట్టగ బంటు నంపి కరుణింపక యూరకఁ జూచుచున్న, నా
పుట్టి మునుంగుఁ గాదె, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 84

చం ॥ నను దయఁ బ్రోవ వేర? శరణంబని వేడిన వైరి తమ్మునిం
గనికర ముంచి రాజ్య మిడిఁ గాచిన గాథలు కట్టు గాథలా
యని తలపింపఁ బోకుర, సహాయుడవై నను గట్టుఁ జేర్చరా
వు, నెనరు లేదె నీకు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 85

చం ॥ తమ కొఱ కార్తితో పలు విధంబుల బాధల కోర్తుఁ గాని వి
త్తములను కొన్న వారలె వితండ వివాదముఁ జేయఁ బూనుచో
విమల వివేక శాంతముల వెన్క విచారము తొంగి చూచుఁ, గా
వుము తగు తాల్మిఁ గూర్చి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 86

ఉ ॥ దాతల పేరుపై చెలగు తర్కవితర్కము లెన్న సిగ్గగుస్
పూతచరిత్రు లెల్ల తమ పూనిన కల్గిన యంత యిచ్చుచో
చేతుల నొగ్గి నమ్రతమ శీలముతోఁ గొనిరాక, హక్కు తేఁ
బోతి మటన్న లగ్గె, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 87

ఉ ॥ బందుగు లొక్క వంక, హరిభక్తి మరొక్కట పీకుచుండగా,
నందు వరేణ్య మేదొ మతి కందక పిన్నలు కొంకు పట్టులస్
కుందగ నేల? దైవమునకుం దలయొగ్గు మటంచు పెద్దలే
పొందుగఁ దెల్పరైరి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 88

చం ॥ ప్రభువర! నీ పదాబ్జములు భావమునం దలపోసి కొల్చి, మీ
శుభకరమూర్తి నెంచి మది చొక్కి సమర్చలఁ దృప్తి నొంది, పా
పభయముఁ బాసి, భక్తుల కృపం జెలువొందెడి దాసదాసు, నీ
వు భయముఁ దీర్చిఁ బ్రోవు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 89

ఉ ॥ ధూర్తుల చేతులం బడి యధోగతి నొందక యుండ నండపై
పూర్తిగ కార్యలాభ మిడిఁ బ్రోచితి వార్త శరణ్య! యెన్నగా
నేర్తునె? మీ ప్రభావ మహనీయ మహత్త్వము, భద్రమూర్తి! యా
పూర్తిని యిచ్చు మాకు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 90

చం ll నిరత సహస్రనామ జప నిశ్చలుడన్ తమ దర్శనార్థమై
చిర పరితాప సంక్షుభిత చిత్తుడనై యిటు వేచియుంటి, పా
మరుడని పంత మేల? యణుమాత్రము సంశయ మేలఁ? బ్రోవ నీ
బురకని వేగ రమ్ము! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 91

చం ll ఎవరని నిన్ను బోల్తు? పరమేశ్వర! కేశవమూర్తి వందునో?
భవుడవుగా నెరుంగుదునో, బ్రహ్మ వటంచని బత్తి సేతునో,
భువి సకలంబు నీవయిన పోలికఁ దోచెడి, విశ్వరూప! నీ
వు వలఁకు నాకు, ఈశ! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 92

ఉ ll అక్కకు బక్క బ్రాహ్మణుని నంటుగఁ దెచ్చెను నీదు తండ్రి, నీ
కక్కట లేదు పుత్రిక, భయానకమౌ వరకట్న బాధ మీ
కెక్కరణిన్ సువేద్యమగు నెందును కూతులఁ గన్నఁ గాక, యా
పొక్కడ కేది దారి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 93

చం ll ఇల నవసాన వేళ నిను నెంతయు భక్తి స్మరింప మోక్ష మ
బ్బు లవము, తప్పదైన నను బోంట్ల కదెట్టులు సాధ్యమయ్య? మా
యల లయకాలు దాడి తెలియంగ, మహాత్మ! యటౌట నేను మా
పులఁ బవలున్ భజింతు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 94

ఉ ll మానను మీదు నామపరమౌ జప మెప్పుడు నా మనంబునన్
పూనను వ్యర్థమానవుల పొల్లు పథంబులఁ బట్టు సేయు టీ
దీనుని వైరివర్గముల దృక్కులఁ దక్కి చరింపఁ జేసి నీ
పూనిక తోడు నేలు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 95

ఉ ll పోలును నీకె దీనజన పోషణ, భక్త జనాళిఁ బ్రోవ రాఁ
బోలును నీకె దాసుడ! ప్రభూ! కరుణింపుము నన్నుటన్న, నీఁ
బోలు వరప్రసాదముల పూర్వముగా నిజ సేవకోటికిన్
బోలెడు పుణ్య మబ్బు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 96

చం ll మరచితి వేమొ రామ! పలుమార్లు నివేదన చేసికొన్న, దే
వర చెవి కెక్కినట్లు కనుపట్టదు నాదగు కష్ట గాథ, మీ
కొరకయి సాహసింప ననుకోని విధంబున తప్పి వచ్చె, నీ
స్ఫురణను మేలుకొల్ప, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 97

చం ll కనికర ముంచ వేర? నయగారమునన్ ననుఁ జేరఁదీసి పూ
నిన నిజ ధర్మ మందు పరిణిష్ఠునిగా ననుఁ దీర్చిదిద్ది, నీ
యనుపమ దివ్యశక్తుల సహాయుడవై నిలబెట్టుకున్న మా
పునుఁ గద భక్తు పెంపు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 98

ఉ ll చిక్కులు నావి చెప్ప నల శేషుని కైన తరంబుఁ గాదు, నా
దిక్కయి జానకీ జనని తెల్పగ జాలునొ యేమొ? నేనిదే
మ్రొక్కెద, ప్రేమమీర ననుఁ బ్రోవు డెదో నొక దారిఁ జూపి నా
పొక్కడ లన్నిఁ దీర్చ, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 99

ఉ ll ఎట్టి ముహూర్త మందు గురు డిచ్చెనొ సత్కృప దివ్యరత్న మే
నెట్టి ముహూర్త మందు మణు లిస్తినొ సానకు, దీప్తి పొల్చి తా
గట్టున చేర్చె నయ్యవి, ప్రగాఢ మహత్తర గూఢ తత్త్వముల్
పుట్టువు నొందె నిందు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 100

ఉ ॥ ఆ రుదురాక మాల యరుదైన మహత్త్వముఁ గల్గఁ బోలు ని
స్సారపు కర్మ బంధముల సాంతముగా నురుమాడి, మీ పదాం
భోరుహసీమఁ జేర్చెను ప్రభూ! యిదె సన్యసనంబుఁ బూన యా
పూరిత మయ్యె మన్కి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 101

ఉ ॥ లోకము లన్నిటిన్ వెలుగులో విలసిల్లగఁ జేయు జ్యోతి నా
లోకనఁ జేయు శక్తి నిడి, లోచన గోచరముం బొనర్చి, ము
ల్లోక తమో విమోచన విలోలముగా విలసిల్లెఁ గాదె నా
పోకడ దిద్దు జ్యోతి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 102

ఉ ॥ శ్రీప! మదీయ పాపము విశేష మటంచు గణింప నేల? సం
దీపిత మాత్మ జ్యోతి తమ దివ్యపదంబుల చెంత వెల్గ, నా
పాపపు చీకటుల్ విరిసి పారక యుండునె? దేవదేవ! నీ
పూపగ నన్ భరించు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 103

ఉ ॥ కంటికి జోడు లేదు, కడు కాయము డస్సెను, యర్థశూన్యుడన్,
కంటికి కూర్కు రాదు, ఘనకార్యము దీనుల సేవ యెన్న, మా
ర్కొంట ధనప్రమత్త బలకోటిని నీదగు తోడు లేక నా
పొంటిని, నెట్లు నేర్తు? చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 104

ఉ ॥ మ్రొక్కెద మీ పదాబ్జము లమోఘ వచస్సుధ నాదరింప నా
దిక్కయి, దిక్కు లేని యతి దీన జనంబుల దుష్టులైన యీ
మ్రుక్కడి భాగ్యవంతుల సముద్ధతి బారికి చిక్కకుండ, నే
పొక్కక నుండఁ బ్రోవు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 105

ఉ ll సన్యసనంబు మాన్యమని సద్గురు సాక్షిగ దీక్షఁ గొంటి, బ్ర
హ్మణ్యుల త్రోవఁ గంటి, భువి మాలల ధూర్తులు మోసపుచ్చ, యే
యన్య పథంబు లేక యసహాయుల కండగ నిల్వ నుంటి, నా
పుణ్యపథంబు నిల్పు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 106

చం ll తలచిన యంత మాత్ర భవతాపము లార్పగ జాలు నట్టి నీ
విలసిత దివ్యనామ సుధ వీనుల విందుగ విన్న, పల్కినన్,
తొలగు భవార్తు లెల్ల, పతితుండను, పాత్రతఁ గాంచిఁ బ్రోచు మీ
వొలుపు కసాధ్య మెద్ది? చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 107

ఉ ll నీ చరితంబు సత్కవుల నిర్మల వాగ్ఝరి గ్రంథరాజమై
తోచెను రామగాథ కడు దొడ్డ పురాణము, విన్న తీరునే?
వాచవిఁ దీర పాఠమును వందల సార్లొనరింప లాభమా?
పూఁచి యొనర్చకున్న, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 108

ఉ ll తా పఠియించు గ్రంథమున తత్పరతన్ ప్రతిపాత్ర యోగ్యతల్
యోపిక తోడ తర్కమతి నూల్కొని, చింతనఁ జేసి, క్షుద్రమున్
పాప మటంచు రోసి, గురుభావన నుత్తమ పాత్ర నెంచి, బ
ల్మోఁపున దిద్దిఁ బ్రోవు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 109

చం ll ప్రవిమల రామ నామమును పంచ రుచుల్ గల వేల్పుబువ్వ దా
చవిఁగొను నెవ్వడేనిఁ గనజాలును మోక్ష పదంబు, లోకపున్
చవులు పదారు వేలయిన సాటికి రావని నిన్నె నమ్మితిన్
భువి నితరంబు రోసి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 110

ఉ॥ నీ దగు బంటు బంట, మది నిల్పి భజించితి మీ పదాబ్జముల్
మీ దగు దర్శనంబునసె మేల్కొని సన్యసనంబు బ్రాఁతిగా
వేదమయా! గ్రహించితిని, వేల కొలంది నమస్సులయ్య! రా
వో! దయఁ జూపిఁ బ్రోవ, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 111

ఉ॥ రూపము నెంతునో ప్రకృతి రూపివి, నీదగు మూల మెన్నుచో
రూపరి నట్టి శూన్యము, నిరూఢిగ తత్త్వ మెరుంగ రాదు, ని
ర్వ్యాప జగద్రచోవిభవ వర్ధన నాశన ముఖ్య లీల లే
వోపిడిఁ జూతు నర్థి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 112

ఉ॥ ఒక్కట రాచకార్య, మొక యోరను వైద్యము, శిష్య బోధయుస్
పెక్కగు వ్యాపృతుల్ గలప, ప్రేమను తోడుగ నీవుఁ గల్గి నా
ప్రక్కకు లోటు రాని గతి పాలన సేయుదు వంచు దీక్షతో
వొక్కుచు వేడు కొందు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 113

ఉ॥ కావుము వీని దేవ! తమ కాళ్ళనుఁ బడ్డది వీని తల్లి, లో
కావళిఁ బ్రోచు తండ్రి! తమ కార్తులఁ బ్రోచుట క్రొత్త యౌనె, నే
నీ విధి లోన నుంటి, కన నేర్తునె నీ దయ సుంత లేక, నస్
బ్రోవుము దక్షుఁ జేసి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 114

ఉ॥ లోకుల కోసమై రణములో నరకాసురుఁ గూల్ప దీక్షతో
చేకొని కృష్ణమూర్తివయి, చేడియ సత్యనుఁ గూడిఁ గూల్పవే,
మూఁకలుగట్టు మారకుల మోసముఁ జెండగ నేడు రావె, నీ
వో కమలాక్ష! శౌరి! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 115

చం ॥ నెలకొని నాదు దేహమున నిండి వెలింగెడి జ్యోతిరూపమా!
తెలియని మోసముల్ వెలికిఁ దెచ్చి రయంబునఁ గాల్చి వేయవే
బలితపు చీకటుల్ విడగ భాసుర దీప్తులఁ బర్వఁ జేయవే
పులుకుచు ధూర్తు లేడ్వ, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 116

చం ॥ పొలిసిరి ఘోర రాక్షసు లపూర్వ బలుల్ జనలోక కంటకుల్,
వెలసెను రామరాజ్య మతి విస్తృత భాగ్యము లబ్బె, జాతి కి
న్నలసిన దీన మానవుల కాదరు వొక్కనిఁ జూపకున్న నే
వొలుపున సౌఖ్య మబ్బు? చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 117

ఉ ॥ మందులు మాకులుస్ రుజల మాన్పునె నీ కృపఁ గల్గకున్న, ఖా
మందువు నీవు ప్రాణులకు, మాన్యత కట్నము వైద్యుపాలు, యీ
చందము వాస్తవమ్ము, ప్రభు! సత్కృప నాపయిఁ జూపి యేలవే,
వొందుగ వైద్యునౌట, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 118

ఉ ॥ ఒట్టు సుమీ! పరేశ! దయ నోమక యూరకఁ జూచుచున్న, మా
పట్టయి దీన మానవుల పాలన సేయక యూరకున్న చో
నెట్టునె దీన బంధువను నీ బిరుదంబు, దయార్ద్ర దృష్టి యే
పుట్టను దాచినావు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 119

ఉ ॥ గట్టిగ మీ పదాబ్జములెఁ గల్గెను రక్షగ మాకటన్న చో,
పట్టియు పట్టనట్లు జడ భావమునస్ తమ రూరకున్న, మా
పట్టయిఁ బ్రోచు వారెవరు? భక్తజనావన! దీనపోష! యీ
బొట్టెనుఁ గావు మయ్య, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 120

ఉ ll కల్గిన వారి మెప్పుకయి కబ్బము లల్ల లవాటు లేదు, వా
రల్గిన జంకు నైజము నిహంబున లేదు, భుజింప నేటికిన్
గల్గె, స్వతంత్ర మార్గ గత గౌరవయుక్త సమార్జితార్జనన్
బుల్గు జనాళిఁ (men in blue) గుంద, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 121

చం ll ప్రవిమల రామ నామమను పంచ రుచుల్ గల వేల్పుబువ్వ నా
భవ రుజ లెల్ల మాన్పు, ఋజుభావము నన్వడి రమ్ముఁ గ్రోలగా
చవులను ముంచి యెత్తు మనసా వినుమన్నను యొప్పె వేగఁ బ్రో
వు వరద! యార్తిఁ దీర్చి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 122

ఉ ll దేవ! మహానుభావ! తమ దివ్య ప్రభావము లెన్న శక్యమా?
భావనఁ జేసి బ్రహ్మకును భర్గునకున్ ఫణిరాజు జిహ్వకున్,
కేవల మొక్క మానవుడ, కింకరుడన్, భవదీయ తత్త్వమే
బ్రోవగఁ నుండె, రమ్ము! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 123

ఉ ll రావలె దీన రక్షక! బిరాన యరాతుల నెల్లఁ దూల్చిఁ, గై
కోవలె త్రోవలేని జన కోటుల కండగ నిల్చి, ప్రాణముల్
వోవగ నైన సిద్ధపడి పూనికతో పనిచేయు త్యాగులన్
బ్రోవ, “హుజూరు”! “కర్జు”, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 124

చం ll సతి నెడఁబాసి శంకరు డశాంతికి లోనయి కుంది, మీ దటన్
సతిఁ గొని నర్ధదేహ మిడి శాంతినిఁ బొందెను, తామటన్న సు
స్థితి సతిఁ గూడి వీడియును ధీరత సత్శివరామమూర్తి య
ద్భుత పద మందు కొంట్రి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 125

ఉ ॥ నా పయి పంతమా? భువననాయక! మోక్షఫలప్రదాయకా!
ప్రాపయి నిల్చి యేల వతి పామరు డంచని యెంచితేమొ? నే
నీ పయి నాసతో పరిగణింతును నా పొరపాట్లు సైచి నన్
పూఁపునఁ గాతు వంచు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 126

చం ॥ త్వరపడి లాభమేమి? తగు దాతయు దైవముఁ గల్గకున్న, నీ
వరమరఁ జేసితేమొ, యిట నా శ్రమ యుండియు కార్యసిద్ధికిన్
జరుగునె కాలయాపన, విచారముఁ గల్గిన లాభ మేమి? య
బ్బురమిట నుండఁ బోదు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 127

చం ॥ మురియుచు నుంటి నీ చరణముల్ పెను ప్రాపుగఁ గల్గె నంచు, సం
బర పడుచుంటి నన్ దరికి పారము చేర్చవె, నీవుఁ గల్గ, దు
స్తర భవసాగరమ్మయిన దాటుదు, నైహిక మొక్క లెక్కయా?
పురుషవరా! పరేశ! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 128

చం ॥ నెలకొని నాదు శూన్యకృశ నీరస మానస క్షేత్ర మందు నీ
విలసిత సారవత్కృప స్రవింపగఁ జేసి వివేక బీజముల్
బలముగ నాటి దివ్య ఫల భాజనమున్ పొనరించు కర్షకా!
పొలిచెను నీ ప్రశస్తి, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 129

ఉ ॥ భారము నీదె సుమ్ము! నను పాలను ముంతువొ, నీట ముంతువో,
చేరితి నీ పదాబ్జముల చెంతకు, నన్ దరిఁ జేర్చిఁ బ్రోవు మే
తీరుగ నైన, నొండొరుల తెన్నెరుగన్, నను దిద్ది తీర్చు మం
భోరుహ నేత్ర! స్వామి! చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 130

ఉ ll ఎక్కువ విన్నవింపఁగల దేమియు లేదు, విశేష మెప్డు నా
చిక్కులుఁ దీర్చు మంచు నొదఁ జెప్పుటయేఁ గద, దీన మీకు చి
ట్టెక్కుటఁ దప్ప నాకు ఫల మేమియుఁ గల్గదు, జాలిఁ జూపి నా
వొక్కడ మాన్పు మయ్య, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 131

చం ll రఘువర! మీ పదాబ్జములు రాతిని నాతిగఁ జేసిఁ బ్రోచె, మీ
యఘ హరనామ మద్భుత మహత్త్వముఁ దేల్చెను రాళ్ళ నీటిపై
లఘిమముఁ గూర్చి, మీదు శరలాఘువ మన్న నమోఘు, మందు నీ
వు ఘనుడ వౌదు వెన్న, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 132

ఉ ll తామర పత్ర మంబు కణ ధర్మము, కూర్మపు టంగ సామ్యముస్
తేమ ప్రదేశ మందు చెడఁ దిర్గెడుఁ గుమ్మరి పుర్వు సాటియుస్
స్వాములు చూపుచుందు రవి సాజము వారికి, మాకు సాధ్యమా?
భూమిక వేరుఁ గాదె? చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 133

చం ll మనమును లాగి పట్టి యభిమానము నెట్టి దశేంద్రియంబులస్
బనివడిఁ గట్టిపెట్టి మిము భావమునస్ విడకుండఁ బట్టి, యో
ర్పున తప మాచరింతు, మును పూజ్యులుఁ జూపిన త్రోవఁబట్టి, నీ
వును దయపుట్టిఁ బ్రోవు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 134

ఉ ll టక్కరి మాటలాడి ప్రకటంబుగ లోకుల కొంపలార్పు, నీ
తెక్కలి కాంధ్ర రాజ్యమున తెచ్చిన పేదల పిచ్చి యోట్లు నీ
యొక్క ప్రభావమైన, నిక నొండొక దిక్కు మరెందు లేదు, నా
వొక్కడ కూరటేది? చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 135

ఉ ॥ మేలగు సర్వ జీవులకు, మేలగు భక్తజనాళి కెంతయున్,
మేలగు దీనకోటికిని, మేలగు నిక్కపు టార్తకోటికిన్
మేలగు సాధ్వు లందరకు, మేలగు సంస్కృతు లందు, లేడు నిన్
బోలు నృపాలు డంద్రు, చిరువోలు పురీశుడ రామభద్రుడా! ... 136

రచయిత పరిచయం క్లుప్తంగా

కీ.శే. శ్రీ చిరువోలు దుర్గాప్రసాద రావు గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని కృష్ణాజిల్లా మోపిదేవి మండలానికి చెందిన చిరువోలు గ్రామ నివాసి. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. విలక్షణమైన బోధనా పద్ధతులున్న ఆదర్శ అధ్యాపకుడిగా ఆయన దేశ విదేశాల్లో శిష్యులు ప్రశిష్యులు ఉన్న మహామేధావి. ఆయన హోమియో వైద్యశిఖామణి, వ్యవసాయ నిపుణుడు, దార్శనికుడు, నిస్వార్థ స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయ వాది, సంఘ సంస్కర్త, మరియు రాజకీయ ధురంధరుడు. చిరువోలు గ్రామంలో ఒక పాఠశాల ఒక రామాలయం కట్టించిన సంఘసేవకుడు ఆయన. ఆయన ఎల్ల వేళలా అన్యాయాన్ని ఎదిరించడానికి ముందడుగు వేసిన మహా మనీషి. అంతే కాదు, ఆయన గొప్ప కవి, భక్తుడు, విరాగి కూడా. ఆయన పల్కు దారుణ ఆఖండల శస్త్రం (వజ్రాయుధం) అంత కఠినమైనా, మనస్సు మాత్రం నవ్య నవనీత సమానం. ఆ కరుణామయుడు ఇతరులకు, ముఖ్యంగా పేదవారికి, సాయం చెయ్యడంలో ఎప్పుడూ ముందుండేవాడు. శ్రీ కామేశ్వరీ శతకం రచించిన రెండు సంవత్సరాల (సుమారుగా) తరువాత వీరు సన్యసించి "రామానందజ్యోతి" అని పేరు మార్చుకున్నారు. శ్రీ కోదండ రామ శతకము, శ్రీ రామభద్ర శతకము, కొన్ని భజన కీర్తనలు అన్నవి వీరి తరువాతి రచనలు.

***